బర్త్‌డే సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌కు పూలబొకే అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి



తెలంగాణ భవన్‌లో.. బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి చెందిన యువత

కేటీఆర్‌కు పూల బొకే అందజేస్తున్న ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, బండారి లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి

ఘనంగా కేటీఆర్ బర్త్‌డే

సిటీబ్యూరో, జూలై 24(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు బుధవారం గ్రేటర్ వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు, కేటీఆర్ అభిమానులు ఆయా ప్రాంతాల్లో బర్త్‌డే కేక్‌కట్ చేసి సంబురాలు చేశారు. పలుచోట్ల రక్తదానం, అన్నదానం, చీరల పంపిణీ, రోగులకు పండ్లు పంపిణీ, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధి భాగ్యశ్రీగార్డెన్‌లో కేటీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ కేక్‌కట్ చేసి సుమారు 2000 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజు శంభీపూర్‌లోని తన కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఇతర నాయకులు ఆయా నియోజకవర్గంలో పెద్దఎత్తున కార్యక్రమాలు చేపట్టారు.



ఎమ్మెల్యే కేటీఆర్‌కు మొక్కను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నేత ముఠా జైసింహ

ఉప్పల్ : ఉప్పల్ డివిజన్‌లోని భరత్‌నగర్‌లో బుధవారం ఎమ్మెల్యే కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులకు పెల్లి నాగరాజు చేతులమీదుగా స్కూల్ యునిఫామ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేకల హనుమంతారెడ్డి, గోనె అర్జున్‌రెడ్డి, ఎం.అంజిరెడ్డి, మంచికంటి రాజు, వర్ధన్, మించ కృష్ణ, రంగ భాస్కర్‌గౌడ్, కాయ హనుమంత్, శివ, సలీం, బూడిద జాంగీర్ గౌడ్, అల్లాభాష, అరటికాయల శ్రీనివాస్, ఎం.హరి, ఎం.జానార్దన్, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో మొక్క నాటుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్, బీఆర్ఎస్వీ నాయకులు

బీఆర్ఎస్ భవన్‌లో రక్తదానం చేస్తున్న వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య



మణికొండ మున్సిపాలిటీలో బుధవారం రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ నాయకులు పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దూళి పాళ్ల సీతారాం, కుంభగళ ధన్‌రాజ్, ఉపేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

- మణికొండ,జూలై 24

గోరటి వెంకన్నకు పురస్కారాన్ని అందిస్తున్న జస్టిస్ భీమపాక నగేశ్

ప్రజాకవి గోరటికి డా.దాశరథి ప్రజా సాహిత్య పురస్కారం

జస్టిస్ నగేశ్ భీమపాక చేతులమీదుగా అందజేత

నాంపల్లి కోర్టులు, జూలై 24(నమస్తే తెలంగాణ): చింతలకుంటలోని వాసవి శ్రీనిలయంలో అభ్యుదయ కవిసామ్రాట్ డా.దాశరథి కృష్ణమాచార్య శత జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. మాభూమి సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మాభూమి – డా.దాశరథి ప్రజా సాహిత్య పురస్కారాన్ని నెలకొల్పారు. ఈ పురస్కారాన్ని తొలిసారిగా ప్రజాకవి గోరటి వెంకన్నకు తెలంగాణ హైకోర్టు జస్టిస్ భీమపాక నగేశ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డా.దాశరథి పీడిత, పేదల పక్షాన ఉన్నారని, పురస్కారం అందుకున్న గోరటి వెంకన్న సైతం అదే కోవకు చెందిన వారన్నారు. పురస్కార గ్రహీత గోరటి వెంకన్న మాట్లాడుతూ.. తెలంగాణలో ఎందరో గొప్ప మహాకవులు, రచయితలు పుట్టారని, సమాజంలో కళ్లెదుట కనిపించేవే తన పాటలకు స్ఫూర్తి అన్నారు. 'సంత మా ఊరి సంత' పాటతో ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లా అదనపు న్యాయమూర్తి కె.మురళీమోహన్ అధ్యక్షత వహించగా, హైదరాబాద్ జిల్లా అదనపు న్యాయమూర్తి మండ వేంకటేశ్వరరావు ఆత్మీయ అతిథిగా, సీనియర్ జర్నలిస్ట్ తాడి ప్రకాశ్, రచయిత కూనపు రాజుకుమార్ విశిష్ట అతిథులుగా హాజరై మాట్లాడారు. దాశరథి గుండెల్లో రాయబడని కావ్యాలన్నీ వెంకన్న రాయాలని మాభూమి సమన్వయ కర్త నరసింహ ప్రసాద్ గొర్రెపాటి కోరారు. ఈ పురస్కారాన్ని ప్రతిఏటా అందిస్తామని సభ్యులు రఘునందన్, ఉదయ్‌శంకర్, నాగిరెడ్డి, ఎన్ఎస్.ఆర్.మూర్తి ప్రకటించారు. డా.దాశరథి, గోరటి వెంకన్న రచించిన పాటలను మహిళలు పాడి అతిథుల మన్ననలు అందుకున్నారు.

సీసీఎంబీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

బయోలాజికల్ ల్యాబొరేటరీలో ప్రాథమిక అంశాలపై అవగాహన

సిటీబ్యూరో, జూలై 24 (నమస్తే తెలంగాణ): సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలార్ బయాలజీ(సీసీఎంబీ)లోని పలు కళాశాలల బోధన, ల్యాబొరేటరీలో పనిచేసే సిబ్బంది, పరిశోధన విద్యార్థులతో పాటు సాధారణ ఉద్యోగులకు ప్రాథమిక పరిశోధన విధానాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా బయోలాజికల్ ల్యాబొరేటరీలో సర్వసాధారణంగా జరిగే మాలిక్యూలర్ క్లోనింగ్, ప్రోటీన్ ఎక్స్‌ప్రెషన్ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణనిచ్చారు. అధునాతన పరిశోధన విధానాలు, పద్ధతులు, పరిశోధన సాంకేతికతను వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో సీసీఎంబీ పరిశోధకులు ల్యాబొరేటరీలో జరిగే ప్రయోగాలు, యంత్ర పరికరాల వినియోగించడంపై శిక్షణనిచ్చారు.

ప్రయాణికులకు టీజీ ఆర్టీసీ శుభవార్త

సుల్తాన్‌బజార్, జూలై 24: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు శుభవార్త తెలిపింది. ఈ మేరకు బుధవారం రంగారెడ్డి రీజియన్ రీజినల్ మేనేజర్ శ్రీలత ఓ ప్రకటనలో తెలిపారు. టీజీ ఆర్టీసీ రాజధాని బస్సు ధరలతో గరుడ బస్సుల్లో ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించినట్లు ఆమె వివరించారు. రాజధాని ఏసీ బస్ సర్వీసుల ఛార్జీతో నడపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఆఫర్ 30 సెప్టెంబర్ 2024 నాటికి బుకింగ్ చేసిన ప్రయాణికులకు కూడా వర్తిస్తుందని, రాజధాని ఏసీ సర్వీసు ఛార్జీతో గరుడా ప్లస్‌లో ప్రయాణించే సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. సీట్లను రిజర్వేషన్ చేసుకునేందుకు tgsrtconline.inని సందర్శించాలని ప్రయాణికులను ఆమె కోరారు.

ఘట్‌కేసర్, ఆరాంఘర్ నుంచి ఆర్టీసీ సేవలు

సిటీబ్యూరో, జూలై 24(నమస్తే తెలంగాణ):ఘట్‌కేసర్ నుంచి కొండాపూర్, ఆరాంఘర్ నుంచి కొండాపూర్ రూట్లలో రెండు మెట్రో ఎక్స్‌ప్రెస్, రెండు సిటీ ఆర్డినరీ బస్సులు ప్రారంభిస్తున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. వెంకటేశ్వర్లు బుధవారం పేర్కొన్నారు.

స్మితా సబర్వాల్ వ్యాఖ్యలపై నిరసన

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 24: దివ్యాంగులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని దివ్యాంగుల జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశాడు. బుధవారం కూకట్‌పల్లి అంబేద్కర్ వైజంక్షన్‌లో ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌ను అరెస్ట్ చేయాలని కోరుతూ.. నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల పట్ల ప్రేమాభిమానాలు చూపాల్సిన ఐఏఎస్ అధికారి.. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేల్పుగొండ వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, జంగిల్ శ్రీనివాస్, ఆనంద్, శేషవలి, మురళి, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

డబుల్ బెడ్రూం ఇండ్లు కబ్జా

పోలీసు, రెవెన్యూ, హౌసింగ్ అధికారుల దాడులు.. పది ఇండ్లు స్వాధీనం

ఇండ్లకు సీల్ వేస్తున్న అధికారులు

ఖైరతాబాద్, జూలై 24: ఖైరతాబాద్ ఇందిరానగర్‌లో కట్టిన డబుల్ బెడ్రూం ఇండ్లను కొందరు కబ్జా చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇందిరానగర్ కాలనీలో సిల్ట్+5 అంతస్తులతో, నాలుగు బ్లాకులు, 37 లిఫ్టులు, 12 షాపింగ్ కాంప్లెక్స్‌లతో అట్టహాసంగా నిర్మించారు. అన్ని బ్లాకులకు 24/7 కరెంటు, తాగునీరు సరఫరా, డ్రైనేజీ, సీసీరోడ్లు, గార్డెన్ తదితర మౌలిక వసతులన్ని కల్పించారు. వీటిలో 2022 ఫిబ్రవరి 3వ తేదీన 200 ఇండ్లను లబ్ధిదారులకు అందించగా, మరో పది గృహాలు ఎవరికీ కేటాయించలేదు. ఈ నేపథ్యంలో కొందరు స్థానికులు అందులోని పది ఇండ్లకు ప్రభుత్వ అధికారులు వేసిన తాళాలను పగుల గొట్టి స్వాధీన పర్చుకున్నారు. అందులో డీ–బ్లాకులో తొమ్మిది ఇండ్లు, బీ–బ్లాక్‌లో ఒక ఇంటిని కబ్జా చేసిన సదరు వ్యక్తులు మూడు ఇండ్లలో సామన్లు పెట్టుకోగా, మిగతా వాటిని కిరాయికి ఇచ్చారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, హౌసింగ్ అధికారులు పోలీసులతో కలిసి ఏకకాలంలో దాడులు చేసి ఆ ఇండ్లను ఖాళీ చేయించారు. అనంతరం తహసీల్దార్ నయీముద్దీన్, హౌసింగ్ ఏఈ మహేశ్, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ సమక్షంలో పది ఇండ్లకు సీల్ వేశారు. కబ్జా విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నామని, ఎలాంటి అలాట్‌మెంట్ లేకుండానే ప్రభుత్వం నిర్మించిన గృహాలను స్వాధీనం చేసుకున్న వారిపై చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిక పంపించినట్లు తహసీల్దార్ నయీముద్దీన్ తెలిపారు. ఇదిలా ఉండగా, కేటాయించిన 200 గృహాల్లోనూ కొందరు స్థానిక ప్రజాప్రతినిధికి చెందిన వారికి మూడు నుంచి నాలుగు గృహాలు సైతం కేటాయించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాటిపై కూడా విచారణ జరిపించాలని కోరుతున్నారు.

జర్నలిస్టులను ప్రేరణగా తీసుకోవాలి

హైదరాబాద్, ఆట ప్రతినిధి:కేఎస్‌జీ జర్నలిస్టుల టీ20 ప్రీమియర్ లీగ్(జేపీఎల్) నాకౌట్ మ్యాచ్‌లు ఉత్సాహంగా జరుగుతున్నాయి. బుధవారం జరిగిన తొలి నాకౌట్ మ్యాచ్ ప్రారంభానికి ముఖ్యఅతిథులుగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, హెచ్‌సీఏ సీనియర్ క్లబ్ సెక్రెటరీ పురుషోత్తం అగర్వాల్ హాజరయ్యారు. ఈసందర్భంగా జగన్ మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు, సామాజిక బాధ్యత వంటి విషయాల్లో జర్నలిస్టులను ప్రతిఒక్కరూ ప్రేరణగా తీసుకోవాలని సూచించారు. పూర్తి ప్రొఫెషనల్ పద్ధతిలో జేపీఎల్ అన్ని హంగులతో నిర్వహించడం చూస్తే బాగుందన్నారు. మరోవైపు తొలుత జరిగిన మ్యాచ్‌లో ఎన్టీవీ 15 ఓవర్లలో 163/6 స్కోరు చేయగా, లక్ష్య ఛేదనలో 'వెలుగు' 8 వికెట్లకు 64 పరుగులు చేసింది. కిరణ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. రెండో మ్యాచ్‌లో 'నమస్తే తెలంగాణ' 9.3 ఓవర్లలో 50 పరుగులకు ఆలౌట్ కాగా, టీవీ9 5.2 ఓవర్లలో మూడు వికెట్లు మిగిలి ఉండగానే విజయాన్నందుకున్నది.

విద్యాభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తాం

విద్యాభివృద్ధికి శక్తివంచనలేకుండా సహకరించేందుకు గోల్కొండ రిసార్టు యాజమాన్యం ఎల్లవేళలా ముందుకు వస్తుందని గండిపేట గోల్కొండ రిసార్టు డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రిసార్టు ఆధ్వర్యంలో ఉచితంగా దాదాపు రూ.4లక్షల విలువజేసే స్టేషనరీ సామగ్రి, బ్యాగులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన స్థానిక కౌన్సిలర్లు గోపాల సునీతగణేష్‌కుమార్, వల్కె విజితప్రశాంత్‌యాదవ్‌లతో కలిసి విద్యార్థులకు అందజేశారు.నాయకులు గోపాల గణేష్‌కుమార్, వల్కె ప్రశాంత్‌యాదవ్, ప్రేంకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – మణికొండ, జూలై 24

బ్రిక్స్ యూత్ సమ్మిట్-2024కు హెచ్‌సీయూ విద్యార్థి

కొండాపూర్, జూలై 24: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగంలో పీహెచ్‌డీ అభ్యసిస్తున్న షేక్ అయేషా రష్యాలో జరుగుతున్న బ్రిక్స్ యూత్ సమ్మిట్–2024కు ఎంపికైనట్లు వర్సిటీ యాజమాన్యం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అయేషా ప్రొఫెసర్ శ్రీనివాసరావు యారగొర్ల పర్యవేక్షణలో పీహెచ్‌డీ కొనసాగిస్తున్నది. బ్రిక్స్ యూత్ సమ్మిట్ రష్యాలోని యుల్యోనోవ్స్క్‌లో ఈనెల 22 నుంచి 26వ తేదీ వరకు కొనసాగుతున్నది. యువతలో చైతన్యం తీసుకురావడం, అంతర్జాతీయ సంబంధాలు, సామర్థ్యాన్ని పెంపొందించడం కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యువ నాయకులను వివిధ ప్యానెల్ సెషనల్‌లు, చర్చలలో పాల్గొనేలా చేసేందుకే యువతను బ్రిక్స్ సదస్సుకు ఎంపిక చేస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. సదస్సులో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా, ఇథియోపియాల నుంచి యువతను ఎంపిక చేశారు.

ఉత్సాహంగా జేపీఎల్ మ్యాచ్‌లు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కేఎస్‌జీ జర్నలిస్టు ప్రీమియర్ లీగ్(జేపీఎల్) ఉత్సాహంగా సాగుతున్నది. టోర్నీలో వేర్వేరు మ్యాచ్‌ల్లో విజయాలు సాధించడం ద్వారా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, బిగ్‌టీవీ సెమీ ఫైనల్లోకి ప్రవేశించాయి. తొలుత జరిగిన మ్యాచ్‌లో వీ6పై బిగ్‌టీవీ(డీఎల్ఎస్) 16 పరుగుల తేడాతో విజయం సాధించింది. వర్షం కారణంగా కుదించిన 12 ఓవర్లలో బిగ్‌టీవీ 2 వికెట్ల నష్టానికి 87 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో వీ6 9 వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసి పోరాడి ఓడింది. మరో పోరులో ఆంధ్రజ్యోతి 42 పరుగుల తేడాతో జీటీవీపై ఘన విజయం సాధించింది. ఆంధ్రజ్యోతి నిర్ణీత 15 ఓవర్లలో 7 వికెట్లకు 147 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో జీటీవీ 105/8 స్కోరుకు పరిమితమైంది.